క్లుప్తంగా

గ్రామ సచివాలయం- 2కు వాటర్ డిస్పెన్సర్ అందజేత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం -2కు సాగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ డిస్పెన్సర్‌ను ట్రస్ట్ ఫౌండర్ ఆరే విజయభాస్కరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి శిరీష, ట్రస్ట్ సభ్యులు రఫీ, శౌరీ పాల్గొన్నారు.

సీఐ వాసుకు ప్రశంసా పత్రం



మేడికొండూరు: జిల్లా పరిధిలోని మేడికొండూరు పోలీసు స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న కె.వాసుకు గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ మంగళవారం ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. ఈనెల 13న పేరేచర్ల జగనన్న అర్బన్ లే-అవుట్‌లో జరిగిన హత్య కేసులో నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చినందుకు ఈ ప్రశంసా పత్రం అందించినట్లు ఎస్పీ వెల్లడించారు. మేడికొండూరు సీఐ వాసు హత్య కేసును తక్కువ సమయంలో ఛేదించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అర్హులకు పథకాలు అందేలా కృషి

ఫిరంగిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ప్రత్యేకాధికారి యుగంధర్ కుమార్ ఆదేశించారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్షలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్, ఎంపీడీఓ అనూరాధ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు జగనన్న సురక్ష ప్యాకెట్ క్యాలెండర్‌ను ఎంపీడీఓ అనూరాధ అందజేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సత్యానంద్, వెల్ఫేర్ అసిస్టెంటు సరళ, డిజిటల్ అసిస్టెంట్ గణేష్ భార్గవ్ ఉన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

తాడేపల్లిరూరల్: వలంటీర్ల నుంచి అధికారుల వరకు సమన్వయంతో పనిచేసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండ సచివాలయంలో క్షేత్రస్థాయిలో వలంటీర్లు, సచివాలయంలో పనిచేసే వివిధ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చిన ప్రతి అర్జీని పెండింగ్ లేకుండా జగనన్న సురక్షలో పరిష్కారం చూపించాలని స్పష్టం చేశారు. వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజా సమస్యలకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపించాలని ఆదేశించారు. అర్హులై ఉండి లబ్ధిపొందని వారు ఉంటే వారిని గుర్తింపు సమస్యలను పరిష్కారానికి కావలసిన పత్రాలు సేకరించాలని సూచించారు. ప్రతి సచివాలయం పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రశాంతి, కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కొలనుకొండ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు, సచివాలయం సెక్రటరీ ఎం.ఎల్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల కోసం నిధి సేకరణ

తాడేపల్లిరూరల్: పోలవరం నిర్వాసితులకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిధి సేకరించారు. పార్టీ రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం పునరావాసం, పరిహారం చెల్లించాలని కోరారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికలకు సైకిళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్: విద్యలో బాలికలను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కొనియాడారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిర్రావూరు, తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు 121 సైకిళ్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చదువుకుంటేనే పేద కుటుంబాల్లో మార్పు వస్తుందనే ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. ఆయన అనంతరం తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు పథకాన్ని ప్రవేశపెట్టి పాఠశాలల్లో మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియంతో పాటు, త్వరలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 నాగేశ్వరరావు, చిర్రావూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ, తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశిరెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి, కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, సభ్యులు పరుచూరి కిరణ్, చంద్ర ఓబులా రెడ్డి, సుకుమార్ రెడ్డి, కళ్లం రాజశేఖరరెడ్డి, గోపు నాగరాజేష్, రాచర్ల శ్రీనివాసరావు, కె.చంద్రశేఖర్ వెంకటేశ్వరరావు, కేశవరావు, శంకర్ శెట్టి, ఎ.రమేష్, సొసైటీ అధ్యక్షులు మేకల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, యేసు ప్రసాద్ పాల్గొన్నారు.



బాలికలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు

మంగళగిరి..

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి విజేత ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి చదువుతున్న పలువురు పేద బాలికలకు మంగళవారం 36 సైకిళ్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ట్రైనర్ ఇసునూరు అనిల్ చక్రవర్తి చేతుల మీదుగా బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు త్రిపురమల్లు సతీష్ మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించడంతో పాటు లింగ వివక్షతను అరికట్టాలనే ప్రధాన ఉద్దేశంతో రూ. 2.16 లక్షల విలువైన 36 సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ అందె మురళి, కోశాధికారి గాజుల శ్రీనివాసరావు, విజేత హైస్కూల్ కరస్పాండెంట్ శాఖమూరి ఉమా మహేశ్వరరావు, సభ్యులు మాదాల రమేష్ బాబు, డైరెక్టర్స్ ధనలక్ష్మి, నిరంజన్ గుప్తా, భిక్షారావు, సుందరయ్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాగంటి హరిబాబు

తాడేపల్లిరూరల్: భూ యజమాని ఒప్పందంతో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ ప్రభుత్వమే గ్రామ సభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు కోరారు. దుగ్గిరాలలోని సంఘం కార్యాలయంలో కౌలు రైతుల మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ భూ యజమానులు అంగీకరించక పోవడంతో చాలా తక్కువ మందికి కౌలు గుర్తింపు కార్డులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారందరూ రైతు భరోసా, ఈ క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారాలు, పంట రుణాలు మొదలైన వాటికి దూరమవుతున్నారని వివరించారు. ఇప్పటికైనా చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులందరినీ ప్రభుత్వం గుర్తించాలని విన్నవించారు. గుర్తింపు కార్డుతో సంబంధం లేకుండా కౌలు రైతులు అందరికీ ఈ క్రాప్ బుకింగ్ చేయాలని అప్పుడే కొంతమంది కౌలు రైతులకైనా న్యాయం జరుగుతుందని అన్నారు. గత ఏడాది కోతల సమయంలో భారీ వర్షాలు కురవడం వల్ల పంటలు దెబ్బతిని కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, గుర్తింపు కార్డులు లేకపోవడంతో వారి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని, దీంతో కౌలు రైతులు అప్పుల పాలయ్యారని అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గుర్తింపు కార్డులు పొందిన వారికి కూడా పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు భూ యజమానుల అంగీకారాన్ని కోరుతున్నారని, ఇది సీసీఆర్‌సీ చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. సమావేశంలో భీమిరెడ్డి అమ్మిరెడ్డి, కొండూరి విజయలక్ష్మి, తోకల రామారావు, కె.దావీదు, రైతు సంఘం నాయకులు ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు పాల్గొన్నారు.

మిర్చి పంటపై రైతులకు అవగాహన



మిర్చి విత్తనాలు అందుకున్న రైతులతో ఉద్యాన పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో జిల్లా ఉద్యాన పరిశోధన సంస్థ బెంగళూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు మిర్చిపంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మిర్చి పంటపై వచ్చు నల్లతామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పైరుచుట్టు మొక్కజొన్న నాటుకోవాలని దీనిద్వారా నల్లతామర ఉధృతి తగ్గుతుందని చెప్పారు. అంతేకాక నీలం, తెలుపు జిగురు అట్టలను పొలంలో ఎకరాకు 20 చొప్పున అమర్చుకోవాలని కోరారు. దుక్కి దున్నే సమయంలో 200 కిలోల వరకు వేప పిండిని ఎకరాకు చల్లుకోవాలని చెప్పారు. అనంతరం సంస్థ ద్వారా తయారు చేసిన మిర్చి విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి మధుసూదనరావు, శాస్త్రవేత్తలు నరేష్, జయంతి, అధికారులు అశోక్‌రెడ్డి, జనన, ఏఓ రమణకుమార్ పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు తాడికొండ విద్యార్థి



విద్యార్థి అభిషేక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్

తాడికొండ: రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు గుంటూరు జిల్లా తాడికొండ సత్యసాయి హైస్కూల్ విద్యార్థి యర్రమాల అభిషేక్ ఎంపికయ్యారు. ఈ నెల 24-25 తేదీలలో అనంతపురం జిల్లా గుంతకల్లులో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ టెన్నిస్ పోటీలలో గుంటూరు జిల్లా జట్టు తరుపున విద్యార్థి అభిషేక్ పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గోగినేని విద్యా సంస్థల అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, సీఈఓ డాక్టర్ అమల విద్యార్థి అభిషేక్‌ను అభినందించారు. త్వరలో రాష్ట్రస్థాయి పోటీలు విజయవాడలో జరగనున్న నేపథ్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాల పేరును ఇనుమడింపజేయాలని సూచించారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ అనిల్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలన

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి ప్రాంతంలోనూ పూడికపోయిన ఉన్న మురుగునీటి అవుట్‌లెట్ పాయింట్లను పరిశీలించి పూడికతీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో మురుగునీటి సమస్యను సోమ వారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయ న దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయ న కార్పొరేషన్ అధికారులకు మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించి, 24 గంటల అనంతరం జరుగుతున్న పనులు పరిశీలించారు. కార్యక్రమంలో తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి, డి.ఇ. కృష్ణారెడ్డి, ఎ.ఇ.లు కిషోర్, ప్రవీణ్, సెక్రటరి ఎం.ఎల్.వి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు కత్తిక రాఘవరావు, మల్లికార్జునరావు(బుల్లబ్బాయి), గొడవర్తి శ్రీను పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి

మంగళగిరి: మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధి బేతపూడి బాపూజీనగర్, దళిత శిబిరంలో తుది దశకు చేరుకున్న కమ్యూనిటీ హాల్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన బాబూజీనగర్, దళిత శిబిరంలో తుదిదశకు చేరుకున్న కమ్యూనిటీహాల్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

పాములపాడు(తాడికొండ): అర్హత ఉన్న ప్రతి పేదవాడికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమాన్ని పేదల ఇంటి వద్దకు అందజేస్తుందని ఎంపీడీఓ అత్తోట దీప్తి అన్నారు. తాడికొండ మండలం పాములపాడులో ఈ నెల 25న గుండెపోటుతో మృతి చెందిన బుస్సాపురపు శివకోటేశ్వరరావు కుటుంబానికి సర్పంచి బిక్కి శివరామకృష్ణ, బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం కన్వీనర్ పరుచూరి నారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, కార్యదర్శి అల్లడి రామారావు పాల్గొన్నారు.

అమృత్ పథకం కింద రూ.66 కోట్లు మంజూరు

మంగళగిరి: నియోజకవర్గానికి మహర్దశ పట్టింది. ఇందులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియోజకవర్గానికి రూ.66 కోట్లు మంజూరు చేశాయి. అమృత్- 2 పథకంలో భాగంగా మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థకు తాగునీటి పథకం కొరకు చెరువుల అభివృద్ధి కొరకు నిధులను కేటాయించారు. కార్పొరేషన్ పరిధిలో తాగునీటి కోసం రూ.52 కోట్లు, చెరువుల అభివృద్ధికి రూ.14.20 కోట్లు, శ్రీ లక్ష్మీనృసింహస్వామి పెదకోనేరు అభివృద్ధికి రూ.2.20 కోట్లు, పెనుమాక గ్రామ చెరువు అభివృద్ధికి రూ.1.60 కోట్లు, చినకాకాని చెరువుకు రూ.1.10 కోట్లు, నిడమర్రు చెరువుకు రూ.2.50 కోట్లు, కాజ చెరువుకు రూ.2కోట్లు కేటాయించారు.

జగనన్న సురక్షతో అర్హులకు ప్రయోజనం

వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్

ఫిరంగిపురం: ప్రతి ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష అమలు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వకర్త కత్తెర సురేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్షపై ఫిరంగిపురం 1,2. అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి వచ్చే నెల 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. 11రకాల సేవలు ఉచితంగా వారికి అందజేస్తారన్నారు. అనంతరం మానమ్మకం నువ్వే జగనన్న పథకాన్ని ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన అమీనాబాద్ వలంటీర్ మహ్మద్ జానీని సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, చిట్టా అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, పాలపాటి రఘు, ఎంపీడీఓ డి.అనూరాధ, పి.మరియబాబు, నాయకులు మెల్కియా, టి.డేవిడ్, గాంధీబుడే, వెంకట్రామిరెడ్డి, వై. ఆశీర్వాదం, హేమలతారెడ్డి పాల్గొన్నారు.

మహిళల జీవన విధానంలో మార్పు అవసరం

కేఎల్‌యూలో సమానత్వంపై కార్యశాల



కార్యశాలకు హాజరయిన కేఎల్‌యూ అధ్యాపకులు

తాడేపల్లిరూరల్: మహిళల జీవన విధానంలో వచ్చి మార్పు అవసరమని కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న కార్యశాలను మంగళవారం నిర్వహించారు. మార్తా ఫెర్రల్ ఫౌండేషన్ డైరెక్టర్ నందితా ప్రధాన్ భట్, సమన్వయ కర్త నిత్య శ్రీరామ్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ మహిళలు ఉద్యోగాలు చేసే కార్యాలయాల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. మహిళలకు సమానమైన భవిష్యత్‌ను సృష్టించేందుకు కీలకమైన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను పరిష్కరించడానికి లింగ సమానత్వం కోసం డైనమిక్ పరివర్తన ఆధారిత ప్రోగామ్‌లను రూపొందించామని అన్నారు. లైంగిక వేధింపుల నివారణపై విశ్వవిద్యాలయంలోని నిర్వాహకులందరికీ అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వర్సిటీ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడం కోసం కేఎల్ మహిళా ఫోరంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలపైన లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా యూనివర్సిటీ యొక్క జీరో టాలరెన్స్ పాలసీపై లింగ సమానత్వం కార్యాలయంలో లైంగిక వేధింపుల వంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తున్న తీసుకున్న చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగ సంక్షేమ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, డీన్ సలహాదారులు డాక్టర్ కె.ఆర్ఎస్.ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ వసుజాదేవి పాల్గొన్నారు.

బయో సెన్సార్‌పై కేఎల్‌యూ ఉమ్మడి పరిశోధన



సింగపూర్ యూనివర్శిటీ ప్రతినిధిని సత్కరిస్తున్న డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు, రిజిస్ట్రార్ సుబ్బారావు

తాడేపల్లిరూరల్: సింగపూర్‌కు చెందిన నాన్యాంగ్ టెక్నాలాజికల్ యూనివర్సిటీతో కలసి కేఎల్‌యూ స్పేస్ సైన్స్‌తో పాటు బయో సెన్సార్‌ల పైన పరిశోధనను చేయడానికి రంగం సిద్ధం చేసినట్లు కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తెలిపారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగపూర్‌కు చెందిన నాన్యాంగ్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయం ప్రతినిధితో సమావేశమై పలు కీలక అంశాలపైన చర్చించినట్లు చెప్పారు. కనీసం 25 మంది విద్యార్థులు వేర్వేరు అధ్యాపకుల ద్వారా 6 నెలల పాటు పరిశోధనలు చేయడం కోసం పరస్పరం సహకరించుకోవడం జరుగుతుందన్నారు. నాన్యాంగ్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ రోడరిక్ బాట్స్ మాట్లాడుతూ కేఎల్‌యూతో కలసి పనిచేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కేఎల్‌యూ ప్రొ చాన్సలర్ డాక్టర్ కె.ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని సులభతరం చేయడానికి హైదరాబాద్, విజయవాడలతో పాటు సింగపూర్‌లో కూడా ఉమ్మడి సమావేశాలు, వర్క్‌షాప్ లేదా పరిశ్రమల పరస్పర కాలపరిమితులను ఏర్పాటు చేసుకోవడం వంటివి తాము గతంలో చేసుకున్న ఒప్పందంలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్శిటీ అధ్యాపకులు డాక్టర్ రోడరిక్ బాట్స్, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, లైఫ్ స్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మెడికో అనుమానాస్పద మృతి



కొడుకు మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు

రాజానగరం: వైద్య కళాశాల క్యాంపస్‌లో ఓ మెడికో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. పోలీసులు, తల్లిదండ్రుల కథనం ప్రకారం.. తెనాలికి చెందిన కొండూరు శ్రీకృష్ణ కేదార్ (27) అలియాస్ శృంగేరి జీఎస్ఎల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి, పీజీ (పీడియాట్రిక్స్) సెకండియర్ చదువుతున్నాడు. కళాశాల ప్రాంగణంలోని స్టాఫ్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఏం జరిగిందో ఏమో కానీ మంగళవారం ఉదయం 6.55 గంటల సమయంలో స్టాఫ్ క్వార్టర్స్ సమీపంలోని కారిడార్ వద్ద కేదార్ విగత జీవిగా పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు వెంటనే సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తికి సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడకు చేరుకుని పరీక్షించగా అప్పటికే అతను మరణించినట్టు గుర్తించారు. దీంతో అక్కడి నుంచే అతడి తల్లిదండ్రులకు, స్థానిక పోలీసులకు డాక్టర్ మూర్తి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. రాజమహేంద్రవరం తూర్పు మండలం డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు, స్థానిక సీఐ కాశీ విశ్వనాథ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని తల్లిదండ్రులు తరలివచ్చి బోరున విలపించారు.

శరీరం నిండా నెత్తుటి గాయాలు, కవుకు దెబ్బలు

మృతుని చెవుల నుంచి రక్తం కారడం, శరీరంపై నెత్తుటి గాయాలు, కవుకు దెబ్బలు ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంతటి పిరికివాడు కాదని, ఇది ఏమాత్రం ఆత్మహత్య కాదని తండ్రి శివరామలింగేశ్వరరావు అన్నారు. కేదార్ మృతిపై తమకు అనుమానం ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి, న్యాయం చేయాలని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మెడికో మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. క్లూస్ టీంను, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. మృతుని ఫోన్ డేటా పరిశీలించగా.. సోమవారం రాత్రి నుంచి తెల్లవారుజామున 6.42 గంటల వరకూ తల్లిదండ్రులతో తరచూ మాట్లాడుతున్నట్టు ఉందని డీఎస్పీ చెప్పారు. అన్ని కోణాల్లోనూ ఈ కేసు దర్యాప్తు జరుగుతుందని తెలిపారు.



శ్రీకృష్ణ కేదార్ (పాత చిత్రం)

ముగ్గురు అన్నదమ్ములకు ఒక్కడే వారసుడు

మృతుడు కేదార్ తండ్రి శివరామ లింగేశ్వరరావుకు ఇద్దరు సోదరులున్నారు. ఈ ముగ్గురికీ కేదార్ ఒక్కడే వారసుడు. 'ముగ్గురు అన్నదమ్ములైన మాకు ఒక్కడే వారసుడు కావడంతో అందరం అల్లారుముద్దుగా పెంచుకున్నాం. మెడిసిన్ చేస్తానంటే చదివించాం. ఎంబీబీఎస్ తరువాత పీజీ చేస్తానంటే ఒకే అన్నాం. ఇలా వాడు అడిగింది ఏదీ కాదనకుండా వచ్చిన మాకు ఇలా కడుపు శోకం మిగులుస్తాడనుకోలేదు' అంటూ కేదార్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సాంఘిక దురాచారాలపై ఎక్కుపెట్టిన అస్త్రాలు కాళ్లకూరి రచనలు


కాళ్లకూరి రచనలపై విశ్లేషణ సదస్సులో ప్రముఖ సాహితీవేత్తలు



జ్యోతిప్రజ్వలనలో సాయిమాధవ్ బుర్రా, వాడ్రేవు సుందరరావు, సుబ్బరాజు, కృష్ణబాబు తదితరులు

తెనాలి: స్వరాజ్య పోరాట కాలంలో సాగిన సంఘ సంస్కరణోద్యమంలో భాగంగా మహాకవి కాళ్లకూరి నారాయణరావు, నాటి సాంఘిక దురాచారాలను తూర్పారబడుతూ రచించిన నాటకాలు జనరంజకమై ఆయన్ను చిరంజీవిని చేశాయని పలువురు నాటకరంగ ప్రముఖులు/రచయితలు అన్నారు. కాళ్లకూరి నారాయణరావు వర్ధంతి రోజైన మంగళవారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆయన రచనలపై విశ్లేషణ సదస్సును నిర్వహించారు. పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ కళల కాణాచి ఆధ్వర్యంలో ఉదయం జరిగిన సదస్సుకు ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. తణుకుకు చెందిన సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు సుందరరావు కాళ్లకూరి నాటకేతర సాహిత్యంపై మాట్లాడుతూ, కాళ్లకూరి నాటకాలతోపాటు వివిధ ప్రక్రియల్లో అనంతమైన సాహిత్య రచన చేశారని చెప్పారు. ఆయన నవల ప్రతాప రుద్రమదేవి నవల ప్రపంచ సాహిత్య చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఆయనే నడిపిన మనోరంజని పత్రికలో గొప్ప కథలు రాశారని, చరిత్ర గ్రంథాలు, విచిత్ర నీతికథలు, బోలెడు వ్యాసాలు, గ్రంథ విమర్శలు, ఎనిమిది ప్రహసనాలు వెలువరించారని చెప్పారు. వరవిక్రయం నాటకంపై మధిరకు చెందిన ప్రముఖ పద్యనాటక రచయిత, దర్శకుడు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు మాట్లాడుతూ సంఘ సంస్కరణోద్యమం లక్ష్యంగా కాళ్లకూరి నాటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న దురాచారాలపై నాటకాలను రచించినట్టు చెప్పారు. పెళ్లి సమయంలో బహుమతిగా ఇచ్చే డబ్బు డిమాండుగా మారుతున్న భవిష్యత్ ఉపద్రవాన్ని ఊహించి వరవిక్రయం రాశారని, వరకట్న దురాచారాన్ని ఏ దేశంలోనూ నరమాంస విక్రయంగా కాళ్లకూరి వ్యాఖ్యానించారని గుర్తుచేశారు. కట్నం తీసుకున్న పురుషుడు సేవకుడే గానీ, మగాడు కాదని ప్రధానపాత్రతో వందేళ్లనాడే చెప్పించిన అభ్యుదయవాది కాళ్లకూరి అన్నారు. పెద్దాపురంకు చెందిన సాహితీవేత్త జోస్యుల కృష్ణబాబు । మధుసేవ నాటకాన్ని విశ్లేషిస్తూ, వరకట్నం, వేశ్యావృత్తి, మద్యపానం ప్రధాన అంశాలను తీసకుని కాళ్లకూరి, వరవిక్రయం, చింతామణి, మధుసేవ నాటకాలను రచించారని చెప్పారు. చెడుస్నేహాలతో మద్యసేవనం, వేశ్యాసంపర్కాలకు అలవాటుపడిన మనిషి, పతనం చెందడాన్ని కళ్లకు కట్టారని తెలిపారు. గుంటూరు సాహితీవేత్త, నాటక రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు చింతామణి నాటకాన్ని విశ్లేషించారు. ప్రధమాంధ్ర ప్రకరణంగా కాళ్లకూరి రచించిన చింతామణి నాటకం ప్రాభవాన్ని గుర్తుచేశారు. ప్రచురణకర్తలు, కొందరు కళాకారులు ఆ మహారచయిత పలు అపరాధాలకు పాల్పడ్డారని చెప్పారు. ఫలితంగానే నిషేధానికి గురైందని, మళ్లీ ప్రదర్శించే మంచిరోజులు ఎప్పుడొస్తాయోనని అన్నారు. డాక్టర్ వాడ్రేవు సుందరరావు విజ్ఞప్తి మేరకు డాక్టర్ కొట్టే వెంకటాచార్యులు రచన కాళ్లకూరి నారాయణ రచనలు పుస్తకం పునర్ముద్రిస్తామని కళల కాణాచి అధ్యక్షుడు, ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ప్రకటించారు. జ్యోతిప్రజ్వలన చేసిన ప్రముఖ రంగస్థల నటి బుర్రా జయలక్ష్మి మాట్లాడుతూ చింతామణి నాటకంతోనే నటిగా గుర్తింపును పొందానని చెప్పారు. వక్తలను, నటి జయలక్ష్మిని నిర్వాహకులు సత్కరించారు. ఇదేరోజు సాయంత్రం కాళ్లకూరి రచించిన వరవిక్రయం పద్యనాటకాన్ని సుమిత్ర యూత్ అసోసియేషన్, మధిర వారు ప్రదర్శించారు. డాక్టర్ విభానుపూడి సుబ్బరాజు దర్శకత్వం వహించారు.

30న విజయవాడలో మహాధర్నా



తెనాలిఅర్బన్: గత సంవత్సరం ఖరీఫ్, రబీలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల భీమా పథకం డబ్బులను వెంటనే చెల్లించాలని కోరుతూ ఈ నెల 31 విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పేర్కొన్నారు. తెనాలి మండల పరిధిలోని కొలకలూరులో మంగళవారం రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ధర్నాలో అందరూ పాల్గొనాలని కోరారు. అలాగే కొలకలూరు, ఖాజీపేట, హాఫ్‌పేట, పంట కాల్వలకు మరమత్తులు చేసి సాగునీరు అందిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు గమిడి శంకరరావు, నాగరాజు, సుబ్బారావు, పాండురంగారావు, మల్లంపాటి శివారెడ్డి పాల్గొన్నారు.